


# యం. ఉమామహేశ్వర రావు .. ఒయాసిస్సు

**మొ**ట్టమొదటిసారిగా ఆమెను అమృతా నర్సింగ్‌హోమ్‌లో చూసేను. మనిషి సన్నగా, రివ్వలా ఉంది. కళ్లు మూసుకుని పడుకున్న జీవచ్ఛవంలా కనిపించింది.

ఆమె నా స్నేహితుడు విశ్వం భార్య.

తొమ్మిదోనెంబరు రూమ్‌లో బెడ్‌మీద నిస్ప్రాణగా పడిఉందామె. పక్కనే బాటిల్‌లోనుంచి చుక్కలుచుక్కలుగా సెలైన్ ఆమె శరీరంలోకి ఎక్కుతోంది. కళ్లుమూసుకుని ఉందామె.

నేనూ, విశ్వం ఇద్దరం ఆ గదిలోకి అడుగులు వేసేం. బెంచీమీద కూర్చున్నా న్నేను. విశ్వం ఆమె దగ్గరగా చేరేడు. అతని ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. ఈలోగా తలుపులు తోసుకుని నర్సు లోపలకు వచ్చింది. విశ్వాన్ని చూసి పలకరింపుగా నవ్వింది.

"మీ మిసెస్‌కు మరింకేం ప్రాబ్లెమ్ లేదు! షి ఈజ్ ఆల్‌రైట్ సార్! రేపుదయాన్నే డిస్చార్జి చేస్తారు!" అంది నర్సు.

విశ్వం ఏమీ మాట్లాడలేదు. భార్యనోసారి ప్రేమగా చూసి గాఢంగా నిట్టూర్చేడు.

"విశ్వం! ఏం ప్రాబ్లెమ్ లేదని నర్సు చెప్పింది కదా! మరేం దిగులు పడకు, పద! అలా బయటకు వెళ్లి, కాఫీ తాగి వద్దాం!" అంటూ విశ్వాన్ని తీసుకుని నర్సింగ్ హోమ్ నుంచి బయటికొచ్చేను. ఎదురుగా 'వెల్‌కమ్' హోటల్. ఖాళీ టేబిలు చూసి

కూర్చున్నాం. కాఫీ ఆర్డరు చేసేను.

నిశ్శబ్దంగా చూస్తున్నాడు విశ్వం. అతనిలో అగ్నిపర్వతాలేవో బద్దలవు తున్నాయి.

"విశ్వం!"

ఉలిక్కిపడి నావంక చూసేడు.

"జరిగిందేదో జరిగిపోయింది. అదంతా మరిచిపోవాలి నువ్వు! ఆమె పరిస్థితికి నువ్వు కారణం కాదని నాకు తెలుసు. అటువంటి భార్యతో వేగడం ఎవరికైనా కష్టమే! అయినా జాగ్రత్తగా ఆమెను నువ్వు డీల్ చేయగల్గితే ... నీ దారిలోకి తెచ్చుకోగలవు!" అంటూ విశ్వం వంక చూసేడు.

వాడిలో స్పందన రాలేదు. సర్వర్ కాఫీలు తెచ్చి టేబిలుపైన ఉంచి వెళ్లేడు. చెరో కప్పు అందుకున్నాం.

* * *

అమృతానర్సింగ్ హోమ్ బిల్లులన్నీ చెల్లించేసి, ఆనక భార్యతోపాటుగా బయటకు వచ్చేడు విశ్వం. బయట ఆటోరిక్షా రెడీగా ఉంది. అందులోకి ఎక్కబోతూ అకస్మాత్‌గా ఆగిపోయిందామె.

"ఈయనెవరు?" నావంక అనుమానంగా చూస్తూ అంది.

"నా ఫ్రెండు. పేరు శ్రీరామ్. ఇక్కడే గాజువాకలో ఉంటున్నాడులే. నీకు ఒంట్లో బాగులేదని, నర్సింగ్‌హోమ్‌లో జాయిన్ చేసేనని తెలిసి, నన్ను చూడాలని వచ్చేడు."

నన్ను పరిచయం చేసేడు.

ఆమెలో ఏ మార్పూ కనిపించలేదు.

'డాక్టర్లకీ, మందులకీ డబ్బెరిచ్చేరు? ఈయనేనా? ఆటోఛార్జీలువెవరిస్తున్నారు? ఈయనేనా?'

ప్రశ్నమీద ప్రశ్న ఆమె నుంచి. నివ్వెరపోయేన్నేను. విశ్వం నిస్సహాయంగా నా వంక చూసేడు.'అదిరా ఆమె ప్రాబ్లెమ్!' అన్నట్లుగా ఉందా చూపు.

ఆటో కదిలింది విశ్వంఇంటివేపుగా. ఆటో కనుమరుగు అయ్యేంతవరకూ అలాగే చూస్తున్న నాకు ఆటోలోంచి విశ్వం చేయి ఊపడం కనిపిస్తూనే ఉంది. 'పూర్ ఫెలో!' ... నిట్టూర్చేను.

* * *

సాయంత్రం ఆరుగంటలు దాటింది. బాగా చీకట్లు కమ్మేయి. వీధిగేటు దగ్గర పొడవుగా, బాగా లావుగా ఉన్న ఆ శాల్తీని చూసి బయటకు వచ్చేను. నన్ను చూసి ఆ శాల్తీ పెదాలు పూర్తిగా విప్పి, "శ్రీరామ్ అంటే మీరేనా?" అని అడిగాడు.

"అవును, నేనే! ఇంతకూ మీరు ...?" నా ప్రశ్న పూర్తవ్వనేలేదు.

"నా పేరు వెంకట్రామయ్య. నేను విశ్వానికి మేనమావని. ఇంతకీ నేను వచ్చింది ..."

అని ఆగేడాయన. అంతవరకూ అతన్ని అలా బయటే నించోపెట్టి మాట్లాడుతున్నానని గుర్తొచ్చి, "లోపలకు రండి! కూర్చుని మాట్లాడుకుందాం!" అని లోపలకు ఆహ్వానించేను.

అడ్డంగా తలాడించేడాయన. 'లేదు, బాబూ! ఏమీ అనుకోకపోతే నువ్వు నాతో ఇప్పుడు బయలుదేరి రాగలవా? కారణాలు అన్నీ తోవలో చెబుతాను.'

అతని కళ్లల్లో అభ్యర్థన తొంగి చూస్తోంది.

"సరే, పదండి వస్తున్నాను!" అంటూ అతన్తో పాటు బయలుదేరాను.

* * *

దుర్గకు మొదట్నించీ, అంటే చిన్నప్పటినుంచీ అహంకారం హెచ్చు. తనీడు పిల్లదగ్గర తన అహంభావాన్ని తరచూ ప్రదర్శిస్తూండేది. ఆ రకమైన గుణం ఆ పిల్లలో చోటు చేసుకోవడానికి కారణం మా అన్నయ్య మార్కండేయుడే ... ఎంతో గారాబంగా పెంచేడు. అడిగినవన్నీ కొనిచ్చేవాడు. అదంతా మావదిన కిష్టం ఉండేది గాదు. ఆడపిల్లను చిన్నప్పటి నుంచి అలా గారాబం చేస్తే, ముందు ముందు అనేక సమస్యలు వస్తాయని పోరేది. కానీ ఆమె గోల గాల్లో కలిసిపోయేది. తండ్రీ కూతుళ్లు ఏకమై ఆమెను ఎగతాళి పట్టించేవారు. దుర్గ ఆడింది ఆట, పాడింది పాటగా సాగింది.

కాలం మనిషి జీవితాన్ని ఒక్కోసారి ఎంత ఘోరంగా దెబ్బతీస్తుందో ముందుగా ఎవ్వరూ ఊహించలేరు. ఓ బస్సు ప్రమాదంలో మా అన్నయ్య మరణించేడు. నిజానికి ఆ ప్రమాదంలో మరణించింది మా అన్నయ్యే అయినా, ఆ కుటుంబం సర్వశక్తులూ మరణించేయనే చెప్పాలి. విధివైపరీత్యం. ఎంతో గారాబంగా, అల్లారుముద్దుగా, డబ్బుకు ఏ ఇబ్బందీ లేకుండా పెరిగిన దుర్గకు అది పెద్ద షాకు. ఆ షాక్ నుంచి ఆమె చాలాకాలం తేరుకోలేదు.

ఓ మంచిరోజు చూసి మా మేనల్లుడు విశ్వాన్ని ఒప్పించి మేమే పెళ్లి చేసేం దుర్గతో. చాలీ చాలని జీతంతో ఎంతో గుంభనంగా గడుపుకోవాల్సిన గుమాస్తా జీవితం విశ్వానిది. ఇప్పుడు ఇలా .... కారణాలు ఏవయితేనేం...విశ్వానికీ, దుర్గకీ ఖర్చుల విషయంలో క్షణం పడలేదు. దాని పర్యవసానమే ఇవన్నీ ..." చెప్పడం ఆపి కన్నీళ్లు తుడుచుకున్నాడు వెంకట్రామయ్య.

మరో అయిదు నిముషాల నడకతో శ్రామిక నగర్‌లోని విశ్వం ఇంటికి చేరేను వెంకట్రామయ్యతో సహా!

దుర్గ గురించి, విశ్వం గురించి మాత్రమే జరిగిన సంగతులన్నీ చెప్పేడుగానీ, అసలీ సమయంలో నన్నెందుకు పిల్చుకువచ్చేడో చెప్పనేలేదు వెంకట్రామయ్య.


ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఏదో జరిగిందిక్కడ? ఏం జరిగింది? ఇంట్లో ఎవరో పెద్ద వయసామె కూర్చుని ఉంది. అంతవరకూ ఏడ్చి, ఏడ్చి అలసిపోయినట్లుగా ఉందామె ముఖం. వెంకట్రామయ్య వంక చూసేను. ఆయన కళ్లు అందించిన సమాచారం గ్రహించేను. ఆమె వెంకట్రామయ్య భార్య. విశ్వం మేనత్త.

విశ్వం భార్య దుర్గ జాడ లేదు. విశ్వం కూడా ఎక్కడా కనిపించలేదు. నా చూపుల్ని గ్రహించిదామె.

"దుర్గ లోపల గదిలో ఉంది!" అంది.

అటు నడిచేడు వెంకట్రామయ్య నన్నూ రమ్మని సైగ చేస్తూ. "భగవంతుడా! విశ్వం ఇంట్లో లేని సమయంలో ఈవిడేదైనా అఘాయిత్యం తలపెట్టలేదు కదా! వాడసలే తట్టుకోలేడు. ఆలోచిస్తూనే ఆ గదిలోకి ప్రవేశించేం. అంతే!!

ఒక్కసారిగా ఏదోనుండి గాలి. యేదో ఝంఝామారుతంలాగే, నా దగ్గరకు వచ్చి, నా కాళ్లను చుట్టేసినట్లుగా ఫీలయ్యాను. తమాయిం





# గోళ్లు వేళ్లకి కిరీటాలు!!

గోళ్ల అందంగా, దృఢంగా, లేత గులాబీ రంగులో ఉంటే మీరు సమతులాహారం తీసుకుంటున్నట్టు లెక్క! గోళ్లు కెరటిన్ అనే ఒక విధమైన ప్రొటీన్‌తో తయారవుతాయి. కాబట్టి మాంసకృత్తులు ఎక్కువగా ఉన్న మాంసం, పాలు, పెరుగు , పప్పుదినుసులు, కూరలు, గుడ్డు వంటివి రోజూ ఆహారంలో ఉండేలా చేసుకోవాలి. గోళ్లు విరిగిపోవడం, పుచ్చినట్టు కావడం -ఫంగస్ ఇన్‌ఫెక్షన్ వల్ల కావచ్చు. దీనికి డాక్టర్ సలహాను అనుసరించి మందులు వాడాల్సి ఉంటుంది.

మధూలిక

చుకుని చూసేసరికి నా కాళ్లమీద దుర్గ.

"అన్నయ్యగారూ! అన్నయ్యగారూ! నన్ను చంపెయ్యండి! నన్ను ముక్కలుముక్కలుగా నరికెయ్యండి! నేను భరించలేను. ఆయన లేని జీవితం నేను భరించలేదు. మూర్ఖురాల్ని ... ఆయన మనస్సు ముక్కలుముక్కలు చేసేను. నన్ను చంపెయ్యండి! నా పీడ ఆయనకు లేకుండా చెయ్యండి! కానీ ...కానీ ...ఒక్కసారి, ఒకే ఒక్కసారి ఆయన్ను నాకు చూపించండి. ఆయన ముఖం నేను చూడాలి. ఆయన కనిపించేవరకూ నేనసలు ఏవీఁ ముట్టను. నన్నిలాగే చావనియ్యండి .." హిస్టీరిక్‌గా ఎంతో ఉద్వేగంతో అంది దుర్గ.

అసలేం జరిగిందో అర్థం గాలేదు నాకు.

"ఏం జరిగిందో మీరైనా చెప్పండి వెంకట్రామయ్యగారూ! ఇంతకీ విశ్వం ఎక్కడికెళ్లాడు? అసలేం జరిగింది? పరిస్థితి తెలియందే నేనుమాత్రం ఏం చేయగలను?" అని నేనన్నాను.

"శ్రీరామ్‌గారూ! ఇదిగో ఈ లెటరు చదవండి! ఏమైందీ మీకే తెలుస్తుంది!" నా చేతికో కవరం దించేడు.

అప్రయత్నంగా నా కళ్లు ఆ అక్షరాల వెంట పరిగెత్తాయి.

"ప్రియమైన దుర్గకు,

చిన్నతనం నుంచి అందమైన జీవితంపట్ల ఎన్నో కలలు కన్నాను. చాలామందికి మల్లే దుస్వప్నాలు కారాదూ అవన్నీ మంచి స్వప్నాలు కావాలీ అని కోరుకున్నాను. తెలిసి తెలిసీ ఎవరికీ ఏ అపకారం చేసి ఎరుగను. స్త్రీపట్ల నేను ఏర్పరచుకున్న గౌరవం అమ్మవల్లనే. జీవితంలో తారసపడిన ప్రతీ స్త్రీని గౌర వంగా చూడాలన్నదే అమ్మ కోరిక. నా జీవితంలో నిన్ను తప్ప మరో స్త్రీని నేనెరుగను.

"ఆదాయం తక్కువయినా, వచ్చినదాంతోనే పొదుపుగా సంసారాన్ని నడుపుతూ నన్ను ధన్యుణ్ని చేసే భార్యవు అవుతావని కలలు కన్నాను. కానీ ...అంతా ఒట్టి భ్రమగా మారిపోయింది. ఒక మధ్యతరగతి వాడిగా గాదు, ఒక లేబరులాగా బతకనారంభించేను. ఎందుకు? ఎందుకని? నా జీవితభాగస్వామివైన నిన్ను సుఖపెట్టాలని. చిన్నప్పటి నుంచి ఖర్చు మనిషైన నిన్ను పేదరికంతో బాధ పెట్టకూడదనే అన్నీ భరించేను. నీతో రాజీపడ్డాను. మన జీవితాలకు ఆధారభూతంగా ఒక బిడ్డయినా పుట్టి, నన్నూ నా బాధల్నీ మరిపింపచేస్తాడని చూసేను. అదీ జరగలేదు.

ఒక సుందరమైన స్వప్నం - ముక్కలై పగిలిపోయింది. నా జీవనరేఖ అడ్డంగా వంపులు తిరిగి, తిరిగి పాతాళాన్ని సృష్టించి నన్ను వెక్కిరించింది. అందుకే నా జీవితానికి ఇక్కడితో మంగళం పాడాలని నిశ్చయించుకున్నాను. పదిరోజుల కిందటే నేను రాసిపెట్టిన నా ఉద్యోగపు వాలంటరీ రిటైర్మెంటు అప్లికేషన్ను మేనేజిమెంటు అంగీకరించింది. నా ఇరవై సంవత్సరాల సర్వీసుకు తగిన సొమ్ముచెక్కు ద్వారా ఇస్తారు. ఆ చెక్కును నా జీవితభాగస్వామివైన నీకు ఇవ్వవలసిందిగా నేను నిన్ననే యాజమాన్యంవారికి తెలియజేశాను. ఎడారిలో ఒయాసిస్సు లాంటి బతుకులో ఒకటగాదు, ఎన్నెన్నో ఎండమావుల్ని చూసేను. నిరర్థకమైన, నిస్సారమైన ఈ బతుకు ముంగిట్లోంచి వెనుదిరిగి ఎక్కడికో వెళ్లిపోతున్నాను.

"ఈ ఉత్తరం నువ్వుచూసే సమయానికి మీకెవ్వరికీ అందనంత దూరంలో ప్రయాణిస్తుంటాను.

"డియర్ దుర్గా! జీవితం అంటే కేవలం ఆడంబరాలు, డబ్బే కాదని, అదొక అలౌకికమైన మధుర మనోహర భావనను రేకెత్తించే సురుచిర సుందర చిత్రమని నువ్వు గ్రహిస్తే చాలు!

ఇట్లు,<br>
నీకెన్నడూ దగ్గర కాలేకపోయిన<br>
విశ్వం."

ఉత్తరం చదవడం పూర్తిచేసి, దుర్గవంక చూసేను బాధగా.

గట్లుతెగి ప్రవహిస్తున్న సెలయేరులాగ ఉందామె. ఆమె నరనరానా పశ్చాత్తాపం రగుల్తోందన్న భావనకు సాక్షిగా, నా పాదాలు వదిలి, భర్త ఫొటోను తీసుకుని గుండెలమీద పెట్టుకుని ఆ గుండెలు ముక్కలయ్యేలా విలపిస్తున్న ఆమె తీరే చెప్తోంది.

వెంకట్రామయ్య భార్య మెల్లగా దగ్గరకు వచ్చింది. "బాబూ! మరో ముఖ్యమైన సంగతొకటి ఉంది."

"ఏమిటి?" అన్నాను.

"బాబూ! ఇన్నాళ్లూ దుర్గ కడుపు పండలేదు. నిస్సారమైన జీవితంలో ఒకర్నొకళ్లు అర్థం చేసుకోలేక ఒపక్క, అసరా అంటూలేక మరోపక్క అలమటించి పోయేరు. కానీ ... కానీ, ఇప్పుడు దుర్గ గర్భవతి! ఈ పరిస్థితిలో విశ్వం ఇలా ..."

దుఃఖంతో పాపం ఆవిడ గొంతు పూడుకుపోయింది.

"ఒరే విశ్వం! నువ్వు కోరుకున్న నీ భార్య నీకు దక్కిందిరా ఇప్పుడు! మీ జీవితాలు ధన్యమయ్యేరోజులు వచ్చేయి. నువ్వెక్కడున్నా వెదికి మరీ తీసుకువస్తాను నిన్ను!" అంటూ ఉద్వేగంగా గొణుక్కుంటున్న నా దగ్గరకు వెంకట్రామయ్య చేరేడు. అతని రెండు చేతులూ జోడించి ఉన్నాయి. అవి నా వేపుగా తిరిగి ఉన్నాయి.